www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
సిరి
People's Voice వార్తపత్రిక
శుక్రవారం
సెప్టెంబర్-18-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 250
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 5

### తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర
# యువ తరానికి అవసరమే

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మహోన్నతమైనది. నిజాం పాలనలో జమీందారులు, భూస్వాములు చేసిన దోపిడీ, పీడన, హత్యలు, మహిళలపై జరిగిన లైంగిక దాడులకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాయుధ పోరాటం సాగింది. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాములు రైతాంగంపై చేసిన అకృత్యాలకు వ్యతిరేకంగా గడీల నుంచి దొరలను, భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ప్రజలది. రైతాంగ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు నిజాం అనుసరించిన దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు.

3





# చెరువుల్లో నీరేది!

## వినాయక నిమజ్జనం ఎక్కడ?

- వర్షాభావంతో నిండని చెరువులు.. భారీ విగ్రహాలు సిద్ధం
- నిమజ్జనానికి తప్పని తిప్పలు
- నీటి లభ్యతపై మండపాల నిర్వాహకుల్లో ఆందోళన

గుమ్మడిదల, సెప్టెంబర్ 17 (సిరి న్యూస్) వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేసినప్పటికీ, నిమజ్జన సమయం దగ్గరపడుతున్న కొద్దీ కొత్త సమస్య ఎదురవుతోంది. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరకపోవడం వినాయక నిమజ్జనాలకు ఇబ్బందికరంగా మారుతోంది. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథులను చెరువుల్లో నిమజ్జనం చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో నీటి లభ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

2







### ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్న
# మున్సిపల్ కమిషనర్?

5వ వార్డులో రోడ్డు స్థలం ఆక్రమణపై మూడు నెలలుగా చర్యలు శూన్యం

- ప్రజా రహదారిపై కాంపౌండ్ వాల్ నిర్మాణం
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం
- కలెక్టర్ జోక్యం చేసుకుని ఆక్రమణలపై విచారణ జరపాలని పట్టణ ప్రజల డిమాండ్

5




### 'ఎపిటోరియా' కార్మికుల
# ప్రాణాలు గాల్లో!

- 'బి' బ్లాక్‌లో పేలిన స్పాట్లర్.. కార్మికుడికి గాయాలు
- నాగార్జున అనే ఉద్యోగికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- కేవలం స్వల్ప గాయాలేనంటూ తేలిగ్గా మాట్లాడిన మేనేజర్
- వరుస ప్రమాదాలు జరుగుతున్నా మారిన భద్రతా ప్రమాణాలు శూన్యం
- ప్రశ్నించే కార్మిక సంఘాలు లేకపోవడంతోనే యాజమాన్య నిర్లక్ష్యం

4

**అరబిందో ఎపిటోరియాలో ప్లాంట్‌లో మరో ప్రమాదం**

భద్రతా లోపాలు, కార్మిక హక్కుల ఉల్లంఘనలతో నిత్యం వివాదాల్లో నిలుస్తున్న 'అరబిందో ఎపిటోరియా' ఫార్మా కంపెనీలో మరో ప్రమాదం చోటుచేసుకుంది. కంపెనీలోని 'బి' బ్లాక్ విభాగంలో అనుకోని రీతిలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. అక్కడ కార్యకలాపాలు సాగుతున్న సమయంలో యంత్రానికి సంబంధించిన స్పాట్లర్‌లో ఊహించని విధంగా ప్రెజర్ బిల్డప్ ఏర్పడింది. ఆ ఒత్తిడిని తట్టుకోలేక పరికరం ఒక్కసారిగా పేలిపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాద తీవ్రతకు సమీపంలోని కార్మికులు ప్రాణాలు కాపాడుకునేందుకు బయటకు పరుగులు తీశారు.

ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్:





# చెరువుల్లో నీరేది!

## వినాయక నిమజ్జనం ఎక్కడ?

**వర్షాభావంతో నిండని చెరువులు.. నిమజ్జనానికి తప్పని తిప్పలు**

**భారీ విగ్రహాలు సిద్ధం.. నీటి లభ్యతపై మండపాల నిర్వాహకుల్లో ఆందోళన**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 17 (సిరి న్యూస్):** వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేసినప్పటికీ, నిమజ్జన సమయం దగ్గరపడుతున్న కొద్దీ కొత్త సమస్య ఎదురవుతోంది. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరకపోవడం వినాయక నిమజ్జనాలకు ఇబ్బందికరంగా మారుతోంది. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథులను చెరువుల్లో నిమజ్జనం చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో నీటి లభ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.




గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతంలో ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పలు చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదు. సాధారణంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం మండపాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అయితే ప్రస్తుతం చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీరు భారీ వినాయక విగ్రహాల నిమజ్జనానికి సరిపోతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది.

### భారీ విగ్రహాలు.. తక్కువ నీరు

గుమ్మడిదల మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈసారి మండపాల నిర్వాహకులు భారీ ఎత్తులో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే నిమజ్జన ఘట్టానికి వచ్చేసరికి చెరువుల్లో నీరు తక్కువగా ఉండటంతో నిర్వాహకుల్లో ఆందోళన మొదలైంది. భారీ విగ్రహాలను తక్కువ నీటిలో నిమజ్జనం చేస్తే అవి పూర్తిస్థాయిలో నీటిలో మునిగే పరిస్థితి ఉండకపోవచ్చని నిర్వాహకులు చెబుతున్నారు. విగ్రహాలను నీటిలోకి తీసుకెళ్లడం, నిమజ్జనం చేయడం, అనంతరం అవశేషాలను తొలగించడం వంటి అంశాల్లోనూ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో నిమజ్జనానికి అనువైన చెరువు ఏది? అక్కడ నీటి పరిస్థితి ఎలా ఉంది? అనే విషయాలపై నిర్వాహకులు చర్చించుకుంటున్నారు.

### వరుణుడి కరుణపైనే ఆశలు

వినాయక నిమజ్జనానికి సమయం దగ్గరపడుతున్నా చెరువుల్లో నీరు లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎలా చేయాలన్న దానిపై స్పష్టత లేకపోవడం నిర్వాహకులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవైపు భారీ విగ్రహాలు సిద్ధంగా ఉండగా మరోవైపు వాటిని నిమజ్జనం చేసేందుకు తగినంత నీరు లేకపోవడం ఉత్సవాల నిర్వహణకు సవాలుగా మారుతోంది. నిమజ్జనం నాటికైనా వరుణదేవుడు కరుణించి వర్షం కురిపిస్తే చెరువుల్లోకి కొంతైనా నీరు చేరుతుందన్న ఆశతో మండపాల నిర్వాహకులు, భక్తులు ఎదురుచూస్తున్నారు. లంబోదరుడి నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా సాగాలని కోరుకుంటూ, వరుణుడు కరుణించాలని భక్తులు వేడుకుంటున్నారు. వర్షాలు కురిసి చెరువులు నిండితే నిమజ్జన సమస్య కొంతమేర పరిష్కారమవుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. లేదంటే భారీ విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. నిమజ్జనానికి ముందుగానే సంబంధిత అధికారులు చెరువుల్లో నీటి పరిస్థితిని పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లు చేయాలని మండపాల నిర్వాహకులు కోరుతున్నారు.





# తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర యువ తరానికి అవసరమే

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మహోన్నతమైనది. నిజాం పాలనలో జమీందారులు, భూస్వాములు చేసిన దోపిడీ, పీడన, హత్యలు, మహిళలపై జరిగిన లైంగిక దాడులకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాయుధ పోరాటం సాగింది. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాములు రైతాంగంపై చేసిన అకృత్యాలకు వ్యతిరేకంగా గడీల నుంచి దొరలను, భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ప్రజలది. రైతాంగ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు నిజాం అనుసరించిన దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. గ్రామాల్లో ప్రశ్నించే స్వేచ్ఛ లేదు. పగలంతా కష్టపడిన బతుకుపైనే హక్కు లేని రోజులవి. వెట్టి చాకిరీ సంకెళ్లతో మగ్గుతున్న తెలంగాణ పల్లెలు ఒక్కసారిగా తిరగబడ్డాయి. ప్రాణాలు పోతాయని తెలిసినా వెనక్కి తగ్గేది లేదంటూ, దున్నేవాడికే భూమి అంటూ నినాదం ఇచ్చారు. సాయుధ పోరాటం 1946 నుంచి ప్రారంభమైన పోరాటం. 1951 వరకు సాగిన రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టులు ప్రజలను చైతన్యపరిచి, నిజాం సైన్యానికి, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు. చిట్యాల ఐలమ్మ చేసిన పోరాటం తర్వాత, భూస్వాముల దాడిలో నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. ఆయన అమరత్వం తర్వాత ఈ పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంగా మరింత రూపాన్ని సంతరించుకుంది. మన భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. కానీ ఆనాటి నిజాం పాలనలో ఉన్న తెలంగాణ ప్రజలకు మాత్రం వెంటనే స్వాతంత్ర్యం రాలేదు. 13 నెలల పాటు ప్రజలు పోరాటం చేశారు. దాదాపు పది లక్షల ఎకరాల భూమిని ఆనాటి కమ్యూనిస్టులు పంపిణీ చేశారు. ఈ పోరాటంలో సుమారు 3,000 మంది చనిపోయారు. క్యాంపులు, గ్రామాల్లో పెట్టి పచ్చి బరియలతో చర్మం వచ్చేంతవరకు కొట్టేవారు. చర్మం కింద కారంపొడి చల్లి మరీ కొట్టినారు.

## 1921లో ఆంధ్ర మహాసభ..

ఆంధ్ర మహాసభను 1921లో ఏర్పాటు చేశారు. రవి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ఏర్పాట్లలో ముఖ్యులు. దోపిడీ పనులను తగ్గించాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఆంధ్ర మహాసభ ముఖ్య ఉద్దేశం మేధావులు మాత్రమే కాదు, ప్రజలు కూడా ప్రశ్నించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మారుమూల ప్రాంతాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. లైబ్రరీలు, పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో రాత్రి సమయంలో లాంతరు పట్టుకొని ప్రజలకు రాత్రి బడులు చెప్పినారు. మాక్సిమ్ గోర్కీ లాంటి వారి నవలలు కూడా ప్రజలు చదివేలా చేసి చైతన్యవంతులను చేశారు. ఆనాడు 1917లో రష్యాలో విప్లవం వచ్చిన తర్వాత దాని పరిణామాలు తెలంగాణ సాయుధ పోరాటంపై కూడా ప్రభావం చూపాయి. సాయుధ పోరాటంలో పాల్గొన్నవారు హక్కుల కోసం పోరాటంతో పాటు, కమ్యూనిస్టులు నేర్పిన రాత్రి బడుల ద్వారా కొన్ని వందల పాటలు, నాటకాలు వేయడం, సాహిత్యాన్ని కూడా పెంచుకున్నారు. వరి నాట్ల దగ్గర ఆనాడు మహిళలందరూ పాటలు పాడుతూ పనులు చేసేవారు. అలా వాళ్లు చైతన్యం కావడం జరిగింది. మహిళల్లో చాలా తెగువ కూడా ఉండేది.

## మరో జలియన్‌వాలాబాగ్..

గ్రామాల్లో శిస్తు వసూలు చేయడం, దానికి వ్యతిరేకంగా పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు. అసలు ఎంత తీసుకున్నారు శిస్తు? రాజు దగ్గర జమీందారు ఉండేవాడు. శిస్తుతో ప్రజలు ఇబ్బందులు పడినారు. మాగాణికి రెండు రూపాయలు, బాగత్‌కు రూపాయి 50 పైసలు, మెట్టకు రూపాయి 25 పైసలు ఇలా శిస్తు కట్టడానికి ప్రజల దగ్గర డబ్బు లేక ఇబ్బందులు పడ్డారు. సరిగ్గా వ్యవసాయంలో పంటలు పండక ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి వాళ్ల సంఘం పెట్టి కూలి కూడా పెంచారు. పోరాటం ఉన్న క్రమంలో వీరా బైరాన్‌పల్లి గ్రామంలో సుమారు 100 మందిని బట్టలు లేకుండా బతుకమ్మ ఆడించి, చిన్నా పెద్దా తేడా లేకుండా చెట్టుకు కట్టేసి చంపివేశారు. ఇది మరొక జలియన్‌వాలాబాగ్‌గా కూడా పిలుస్తారు.

## పోలీస్ యాక్షన్ చేపట్టడంతో..

పోరాటం జరుగుతున్న సమయంలో సుమారు 3,000 గ్రామాల్లో గ్రామ స్వరాజ్య కమిటీలు వేశారు. ఆ గ్రామాల్లో సమిష్టి వ్యవసాయం చేసుకునేవారు. వ్యవసాయ పనులు గ్రామంలోనే కలిసి చేసుకునేవారు. ఇలాంటి గ్రామాల్లో వివక్ష గాని, అసమానతలు గాని లేవు. కులం లేదు, మతం లేదు. ఆ గ్రామాల్లో కులాంతర, మతాంతర వివాహాలు కూడా గ్రామ స్వరాజ్య కమిటీలు వేసి గ్రామాల్లో జరిగాయి. గ్రామ సభల ద్వారా సమస్యలు పరిష్కరించుకునేవారు. బంతి భోజనాలు చేశారు. ఈ గ్రామాల్లో. 1948 సెప్టెంబర్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో భారత సైన్యం 'పోలీస్ యాక్షన్' చేపట్టడంతో నిజాం పాలన ముగిసి, నిజాం సైన్యం లొంగిపోయింది. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. అయితే భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన రైతాంగ పోరాటం వెంటనే ఆగలేదు. కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజా ఉద్యమం కొనసాగి, 1951లో సాయుధ పోరాటాన్ని విరమించడంతో ఈ మహత్తర పోరాటం ముగిసింది.

## ఎర్రజెండా ద్వారానే..

ఈ మధ్యకాలంలో సారంపల్లి మల్లారెడ్డి సంతాప సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల భూమిని పంపిణీ చేశారని, ఉపాధి హామీ చట్టం తీసుకురావడంలో కూడా ఎర్రజెండా ఉద్యమం పాత్ర ఉందని, పేదవాడికి న్యాయం జరుగుతుందంటే అది ఎర్రజెండా ద్వారానే అని కూడా అన్నారు. మొన్నటి వరకు జేఎన్‌జీ ఉద్యమం, నీట్ పరీక్ష నిర్వహణ వల్ల అనేకమంది ఇబ్బందులు పడితే, జంతర్ మంతర్ వద్ద వామపక్ష పార్టీలు శాంతియుతంగా నిరాహార దీక్ష చేసి నిరసన తెలిపాయి. దేశవ్యాప్తంగా రైతులు, మేధావులు అందరూ కలిసి కేంద్ర విద్యాశాఖ మంత్రిని తొలగించాలనే డిమాండ్‌తో ఉద్యమాలు చేసి విజయం సాధించారు. నేటి యువతకు ఉద్యమం కూడా ఆదర్శం. ఇప్పుడున్న యువతకు పోరాట వారసత్వం తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు కూడా ఇది తెలంగాణ సాయుధ పోరాట గడ్డ అని, ఇక్కడ మతోన్మాద శక్తుల ఆటలు సాగనివ్వమని తమ ప్రసంగాల్లో ఘాటుగా విమర్శలు చేస్తారు. కానీ బీజేపీ మాత్రం తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ-ముస్లిం కొట్లాటగా చిత్రీకరించి లాభపడాలని ప్రతిసారి అనుకుంటుంది. కానీ తెలంగాణ ముమ్మాటికి విలీన పోరాటం మాత్రమే. మతోన్మాద శక్తుల ఆటలు ఈ తెలంగాణ గడ్డపై సాగనివ్వం.



వ్యాసకర్త
రెడ్డమైన అరవింద్
9533687400




# ‘ఎపిటోరియా’ కార్మికుల ప్రాణాలు గాల్లో!

## అరబిందో ఎపిటోరియాలో ప్లాంట్‌లో మరో ప్రమాదం

భద్రతా లోపాలు, కార్మిక హక్కుల ఉల్లంఘనలతో నిత్యం వివాదాల్లో నిలుస్తున్న ‘అరబిందో ఎపిటోరియా’ ఫార్మా కంపెనీలో మరో ప్రమాదం చోటుచేసుకుంది. కంపెనీలోని ‘బి’ బ్లాక్ విభాగంలో అనుకోని రీతిలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. అక్కడ కార్యకలాపాలు సాగుతున్న సమయంలో యంత్రానికి సంబంధించిన స్పాట్లర్‌లో ఊహించని విధంగా ప్రెజర్ బిల్డప్ ఏర్పడింది. ఆ ఒత్తిడిని తట్టుకోలేక పరికరం ఒక్కసారిగా పేలిపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాద తీవ్రతకు సమీపంలోని కార్మికులు ప్రాణాలు కాపాడుకునేందుకు బయటకు పరుగులు తీశారు.

ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్:

- ‘బి’ బ్లాక్‌లో పేలిన స్పాట్లర్.. కార్మికుడికి గాయాలు
- బయటకు పరుగులు తీసిన కార్మికులు
- నాగార్జున అనే ఉద్యోగికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- కేవలం స్వల్ప గాయాలేనంటూ తేలిగ్గా మాట్లాడిన మేనేజర్
- వరుస ప్రమాదాలు జరుగుతున్నా మారిన భద్రతా ప్రమాణాలు శూన్యం
- ప్రశ్నించే కార్మిక సంఘాలు లేకపోవడంతోనే యాజమాన్య నిర్లక్ష్యం
- ప్రమాదాల సమాచారాన్ని బయటకు రాకుండా తొక్కి పెట్టే కుట్రలు
- రసాయనాల నడుమ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని కార్మికుల పనులు
- ఫ్యాక్టరీల తనిఖీ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టాలని డిమాండ్

### ప్రశ్నించే యూనియన్లు లేకపోవడమే యాజమాన్యానికి ధీమా

అరబిందో ఎపిటోరియాలో ఇలాంటి ప్రమాదాలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ అనేక బ్లాకుల్లో విషవాయువుల లీకేజీలు, రియాక్టర్లు, ప్రెజర్ బ్లాస్టలు జరిగి ఎందరో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులు కావడం జరిగింది. కంపెనీలో కార్మిక సంఘాలు లేకుండా యాజమాన్యం అణచివేయడం వల్లే ఇలాంటి నిర్లక్ష్యం రాజ్యమేలుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. లోపల జరుగుతున్న లోపాలను, ప్రమాదాలను నిలదీసే దిక్కు లేకపోవడంతో చిన్నపాటి ప్రమాదాలుగా చిత్రీకరించి పోలీసులకు, లేబర్ విభాగానికి సమాచారం ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా మేనేజ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### స్వల్ప గాయాలేనంటూ మేనేజర్ శోభన్ బాబు దాటవేత

‘బి’ బ్లాక్‌లో జరిగిన ప్రమాదం, కార్మికుడు గాయపడిన వ్యవహారంపై ఫ్యాక్టరీ మేనేజర్ శోభన్ బాబును వివరణ కోరగా, ఆయన ఈ సంఘటనను చాలా సాధారణ విషయంగా కొట్టిపారేసే ప్రయత్నం చేశారు. ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని అంగీకరిస్తూనే.. ఉద్యోగి నాగార్జునకు కేవలం స్వల్ప గాయాలు మాత్రమే అయ్యాయని తేలిగ్గా మాట్లాడారు. ప్రస్తుతం అతనికి చికిత్స చేయిస్తున్నామని, పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదంటూ చేతులు దులుపుకునే ధోరణిలో స్పందించారు.

### ఉద్యోగి నాగార్జునకు గాయాలు

ఈ ఆకస్మిక పేలుడు ధాటికి అక్కడే విధుల్లో నిమగ్నమై ఉన్న కంపెనీ ఉద్యోగి నాగార్జున గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలంలో ఉన్న తోటి కార్మికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గాయాలతో ఉన్న నాగార్జునను వెంటనే అక్కడి నుంచి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆసుపత్రికి చేర్చారు. రసాయన పరిశ్రమల్లో ప్రెజర్ నియంత్రణ వ్యవస్థలు ఎంత పకడ్బందీగా ఉండాలో తెలిసినప్పటికీ.. నిర్వహణ లోపం వల్లే ఈ బ్లాస్ట్ జరిగిందని తోటి కార్మికులు చెబుతున్నారు.

### అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి

ఒకవైపు కార్మికుల ప్రాణాలకు కనీస రక్షణ కల్పించకుండా, మరోవైపు పరికరాల నాణ్యత, భద్రతా ప్రమాణాలను గాలికొదిలేసి ఉత్పత్తిని కొనసాగిస్తున్న అరబిందో ఎపిటోరియా తీరుపై కార్మిక వర్గాలు భగ్గుమంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఫ్యాక్టరీల తనిఖీ అధికారులు, కార్మిక శాఖ ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి తక్షణమే కంపెనీలోని ‘బి’ బ్లాక్‌ను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. స్పాట్లర్ పేలుడుకు దారితీసిన సాంకేతిక కారణాలు ఏమిటో నిగ్గుతేల్చాలని, గాయపడిన ఉద్యోగి నాగార్జునకు మెరుగైన కార్పొరేట్ వైద్యంతో పాటు పరిహారం అందించేలా చూడాలని కోరుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై కఠినమైన చట్టపరమైన కేసులు నమోదు చేయాలని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి.



# ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్న మున్సిపల్ కమిషనర్?






- ఫిర్యాదు చేసిన పౌరులకు కమిషనర్ రవీందర్ దురుసు సమాధానం?
- ప్రజా రహదారిపై కాంపౌండ్ వాల్ నిర్మాణం
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం
- ముదిరాజ్, యాదవ సంఘాల ఫిర్యాదులకూ స్పందన కరువు
- రోడ్డు ఆక్రమణతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు
- అధికారుల మౌనంపై అనుమానాలు
- కలెక్టర్ జోక్యం చేసుకుని ఆక్రమణలపై విచారణ జరపాలని పట్టణ ప్రజల డిమాండ్

## 5వ వార్డులో రోడ్డు స్థలం ఆక్రమణపై మూడు నెలలుగా చర్యలు శూన్యం

రామాయంపేట, సెప్టెంబర్ 17 (సిరి న్యూస్) ప్రజల రక్షణకు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు బాధ్యులుగా ఉండాల్సిన అధికారులే ఆక్రమణదారులకు అండగా ఉన్నారా? ప్రభుత్వ భూములను, ఆస్తులను కబ్జా చేస్తే రక్షించాల్సిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదా? ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రభుత్వం పదే పదే చెబుతున్న కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా అట్టి భూములు, రహదారులు అన్యాక్రాంత మవుతున్నాయి. సరిగ్గా అదే కోవలో ఒక రహదారి నిలవడం రామాయంపేట మున్సిపాలిటీలో తీవ్ర కలకలం రేపుతోంది. పట్టణంలోని 5వ వార్డులో రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఇష్టానుసారంగా కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నా, మున్సిపల్ యంత్రాంగం నిద్రపోతున్న తీరు అధికారుల అనైతికతకు అద్దం పడుతోంది. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన రహదారిని కొందరి స్వార్థం కోసం కబ్జా చేస్తుంటే, ఫిర్యాదు చేయడానికి వెళ్లిన పౌరులపై కమిషనర్ ఏకంగా "ఏం చేసుకుంటావో చేసుకో.. ఎక్కడికి వెళ్తావో వెళ్లు" కలెక్టర్కు ఫిర్యాదు చేసిన మళ్లీ నా దగ్గరకు రావాల్సిందే.... అంటూ బెదిరింపు



ధోరణిలో మాట్లాడటం ఆయన అహంకారానికి, బాధ్యతరాహిత్యానికి నిదర్శనం. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన స్థానంలో ఉన్న ఒక అధికారి ఇంతటి దురుసుగా వ్యవహరించడం మున్సిపల్ చరిత్రలోనే సిగ్గుచేటైన విషయమని పలువురు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును కబ్జా చేసి కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని సుమారు గత మూడు నెలల క్రితం ముదిరాజ్ సంఘం, యాదవ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడం గమనార్హం. అక్రమ నిర్మాణాలపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కమిషనర్‌పై ఉన్నప్పటికీ, ఆయన మౌనం వహించడం వెనుక మతలబు ఏమిటో వారికే తెలియాలి. క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా, అక్రమ నిర్మాణాన్ని నివారించకుండా కమిషనర్ నేరుగా కబ్జాదారులకు కొమ్ముకాయడం చూస్తుంటే వ్యవస్థ ఎంతలా భ్రష్టపడిందో అర్థమవుతోంది. ప్రజల రాకపోకలను అడ్డుకుంటూ, రోడ్లను కుదించేస్తున్న ఈ కబ్జాపర్వానికి మున్సిపల్ అధికారులే పూర్తి బాధ్యత వహించాలి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, ఈ దురుసు కమిషనర్ వ్యవహారశైలిపై మరియు రామాయంపేట 5వ వార్డులో జరుగుతున్న రోడ్డు ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలి. బాధ్యత మరిచి ప్రవర్తించిన కమిషనర్‌పై తక్షణమే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమ నిర్మాణాన్ని నేలకూల్చి ప్రజా ఆస్తులను కాపాడాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### వారం రోజుల్లో కూల్చేస్తాం : రామాయంపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్ వెల్లడి

రామాయంపేట పట్టణంలోని 5వ వార్డులో రహదారి కబ్జా విషయం గురించి స్థానిక మున్సిపల్ కమిషనర్ రవీందర్ ను వివరణ కోరగా, ఈ విషయంలో తమకు ఫిర్యాదు అందిందని తెలిపారు, అయితే ప్రహరీ గోడ నిర్మాణం గురించి వివరాలు తెలుసుకోవడానికి సిబ్బందిని పంపించినట్లు తెలిపారు, ఒకవేళ అక్రమ కట్టడం అని తేలితే వారం రోజుల్లో అట్టి గోడను కూల్చివేస్తామని తెలిపారు.



